రెండు ప్రపంచాల మధ్య

"అత్తమ్మకు ఫైర్ వర్క్స్ చూపిద్దాం శ్రీ", అంగీకారంకోసం భర్త వైపు చూసి, అత్త వైపు చూస్తూ శైలజ అంది.

కొడుకు శ్రీధర్‌ను కోడలు 'శ్రీ' అని పిలవటం కొన్ని గంటల్లోనే కాంతమ్మకు అలవాటయింది. ముచ్చటేసింది.

"ఏమిటమ్మా అది?" అని అడిగింది.

"మన పక్క టపాసులు కాల్చడం అంటారే అదమ్మా. చాలా బాగుంటుంది. చూడాల్సిందే. ఈరోజు శనివారం కూడా. జనం గుంపులు గుంపులుగా వస్తారు చూడడానికి. బాగా సందడిగా ఉంటుంది. సరదాగా ఉంటుంది", తల్లికి శ్రీధర్ ఆమెకు అర్థమయ్యే భాషలో చెప్పాడు.

"ఎవరింట్లో వాళ్ళు కాల్చుకోరా? అందరూ ఒక్కచోటనా?" కాంతమ్మ అమాయకంగా అడిగింది.

"ఇది ఎవరింట్లో వాళ్ళు కాల్చుకునేది కాదమ్మా! చూసి నువ్వే చెబుదువు", శ్రీధర్ ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు.

"శ్రీ! మనం నైన్ థర్టీకల్లా చేరుకోవచ్చు. గవర్నర్ మిఫ్లిన్ ప్లేగ్రౌండ్ మనకు దగ్గరే. ప్లేగ్రౌండ్‌కు కాస్త దగ్గర్లో కారును పార్క్ చేద్దాం. నడుచుకుంటూ పోదాం అక్కడికి. ఆ ఎట్మాస్ఫియర్‌ను అత్తమ్మ చూడనీ", అంది శైలజ.

తనపట్ల కొడుకూ, కోడలూ చూపిస్తున్న అపేక్షకు, కాంతమ్మ మురిసిపోయింది. తమ ఫ్లాట్ ఉంటున్న స్ప్రింగ్‌సైడ్ డ్రైవ్ నుంచీ, ముగ్గురూ కారులో బయలుదేరారు. కారు అద్దాల్లోంచీ కన్పిస్తున్న విద్యుద్దీపాల కాంతుల్నీ, రంగురంగుల

ప్రకటనల అక్షర విన్యాసాల్నీ, వస్తూ పోతున్న కార్లనూ, రోడ్డు పక్కల దిద్ది తీర్చినట్లుండే ఇళ్ళనూ, చెట్లనూ, వనాలనూ కాంతమ్మ చూస్తూపోతూ 'ఇదేదో కొత్త లోకం, సినిమా లోకం కన్నా బాగుంది' అనుకుంది. స్వంత ఊరు కొట్టాలపల్లె దగ్గర నుంచీ, కొడుకు వెంట బయలుదేరి నిన్నటి దినం రెడింగ్ చేరుకునేంతవరకూ, కాంతమ్మ పసి మనసుతో అన్నీ చూసింది. ఆశ్చర్యపోయింది, అబ్బురపడింది, తడబడింది, అయోమయాన్ని కూడా రుచి చూసింది.

బాణసంచా ఉత్సవాన్ని చూడటానికి వచ్చిన జనం, ప్లేగ్రౌండ్ చుట్టూ ఉండే ఖాళీ స్థలాలు ఎక్కడ దొరికితే అక్కడ కూర్చొనీ, నిలబడీ, అటూ ఇటూ తిరుగుతూ, ముచ్చట్లతో, చిరుతిండ్లతో, కోక్ టిన్నులతో కన్పించారు. కుడి ఎడమలా, ముందూ వెనకా ఉన్న అత్యధిక శ్వేత జనసందోహాన్నీ, సంరంభాన్నీ, సంబరాల్నీ చూసి కాంతమ్మకు వణుకు పుట్టింది. శ్రీధర్ తమకు చోటు కోసం కలయచూస్తున్నాడు.

అత్త చెయ్యి పట్టుకొని శైలజ. కాంతమ్మ కట్టూ బొట్టును కొందరు కుతూహలంగా, చిత్రంగా చూశారు. ఇంగ్లీషులో ఏదో అనుకుంటూ తన వైపు చూసి నవ్వటం, ఒకరిద్దరు 'హాయ్' అనటం, చేతులూపటం చూసి కాంతమ్మ బిత్తరపోయింది.

"ఇక్కడేం భయంలేదు అత్తమ్మా. మిమ్మల్నీ, మీ చీరెనూ మెచ్చుకుంటున్నారు వాళ్ళు. మీరు అందంగా ఉంటారు అత్తమ్మా!", కాంతమ్మకు శైలజ ఉత్సాహాన్నీ, ధైర్యాన్నీ ఇవ్వటానికి ప్రయత్నిస్తూ అన్న మాటలకు కాంతమ్మ సంతోషపడి అంది:

"నువ్వు ఈ అమెరికా వాళ్ళ బట్టల్లో చాలా చక్కగా ఉంటావు శైలజమ్మా. నీ ఒంటి పసిమి రంగు అమ్మదా? నాన్నదా?" కోడలిని మనస్ఫూర్తిగా మెచ్చుకుంటూ కాంతమ్మ అడిగింది.

"నాన్నది", అంది శైలజ ఆనందపడిపోతూ.

ఖాళీ జాగా దొరికింది.

"ఇక్కడ కూర్చుందాం శైలూ మనం. అమ్మకు ఫైర్‌వర్క్స్ బాగా కన్పడతాయి, ఇక్కడ నుంచీ."

శ్రీధర్ తల్లిని తన కుడివైపు కూర్చోబెట్టుకొని పొదివి పట్టుకున్నాడు. శైలజ ఎడమ వైపు కూర్చుంది. అమ్మ అమ్మే అనుకుంది, తన తల్లిని జ్ఞాపకం చేసుకుంటూ.

వ్యక్తి విలక్షణాంశాలు ఏ బృందంలోనైనా ఆకర్షకంగా ఉంటాయి. కాంతమ్మ చీరెకట్టూ, బొట్టూ, జాకెట్టూ, రూపూ, దగ్గరగా ఉండే వాళ్ళు అప్పుడప్పుడు చూస్తున్నారు. తల్లి ఇబ్బందిని గమనిస్తూ శ్రీధర్ అన్నాడు:

"అమ్మా! అమెరికా వాళ్ళు చాలా మర్యాదస్తులు. కలుపుగోలు మనుషులు. వాళ్ళు వెకిలిగా చూడడం లేదు చూడు. మెచ్చుకుంటూ చూస్తున్నారు."

కొడుకు మాటలతో, కోడలు ముందే చెప్పడంవల్లా, తనను చూస్తున్న మహిళల కళ్ళల్లో, తనకు అర్థంకాని భాషలోని మార్దవం వల్లా, కాంతమ్మ బెరుకు తొలగిపోయింది. ధైర్యం కూడగట్టుకొని చుట్టూ కలయచూసింది.

కాంతిపుంజాల మధ్య అంతమంది జనాన్ని ఒక్కచోట తన యాభై దాటిన బతుకులో ఏరోజూ చూడలేదు అనుకుంది కాంతమ్మ. తెలిసీ తెలియని వయసులో ఏడ్చి మొత్తుకుంటే తల్లిదండ్రులు తమ వెంట తీసుకవెళ్ళినప్పుడు చూసిన ప్రొద్దుటూరు రామేశ్వరం తిరణాల – ఆ దేవాలయం, పెన్నేటి ఇసుక తిన్నెల మీద అంగళ్ళూ – కాంతమ్మకు గుర్తుకొచ్చాయి. కాస్త వయసు వచ్చాక, బంధువుల ఊరు రావులపల్లెకు తల్లితో కలసి వెళ్ళినప్పుడు, చూసిన పుష్పగిరి తిరణాల – ఆ కొండ మీది గుడీ, గుడి కింద ఏరూ, ఒకటో రెండో సత్రాలూ, ఏట్లో రాత్రి పడుకున్న జనం – మనసులో మెదిలారు. పెళ్ళికి ముందు, అవ్వా, తాతా వెంట వెళ్ళి చూసిన గూగూడు కుళ్ళాయిస్వామి తిరణాల గుర్తుకొచ్చింది. పెళ్ళయిన కొత్తల్లో అత్తగారి ఊళ్ళో జరిగిన దేవర – ఆ గుంపులూ, ఆ బోనాలూ, ఆ మేకల, పొట్టేళ్ళ, కోళ్ళ బలులూ – స్మృతిలో మెదిలాయి. అదే తమ ఊళ్ళో ఆఖరు దేవర. బలి అయిన పెద్ద తలకాయ కోసం కొట్లాడి, పత్రావాడు వాములకు అగ్గిపెట్టి, పారిపోతూ ఉంటే పట్టుకొని మండుతున్న వామిలోకి వేసినారని విన్నది జ్ఞాపకం వచ్చింది. కాంతమ్మకు ఒళ్ళు జలదరించింది. వాటన్నిటిలో లేనిదేమిటో, ఇక్కడ కొత్తగా ఉన్నదేమిటో కాంతమ్మ స్పష్టంగా గుర్తించలేకపోయింది. 'వాటికంటే ఇది చాలా బాగుంది. ఆ మనుషులకంటే వీళ్ళు బాగున్నారు' అనుకుంది.

"పది అవుతోంది. ఫిఫ్టీన్ సెకండ్స్‌లో ఫైర్‌వర్క్స్ మొదలవుతాయి", అంది శైలజ.

"చూడమ్మా, చూడమ్మా, అదిగో ఆ కుడివైపు చూడు", శ్రీధర్ తల్లిని భుజాలు పట్టుకొని ప్రేమగా ఊపుతూ హెచ్చరించాడు.

కాంతమ్మ అటువైపు చూసింది.

ప్లేగ్రౌండ్‌లో చీకటీ, చిరువెలుగులూ – లీలగా ఏవో ఆకారాలు కదులుతున్నాయి. బాణసంచా రగిలింది. రవరవల మధ్య చిమ్ముకుంటూ, నింగి పైకి ఎగసి, ఎగసిపోతూ, ఆకాశంలో ఎంతో ఎత్తున రంగు రంగుల కాంతుల రాశుల్ని వెదజల్లుతూ, రాలే నక్షత్రాల్ని తలపిస్తూ ఉండిన అపూర్వ దృశ్యం కాంతమ్మ కళ్ళకు కనబడింది. ఆమె నిబిడాశ్చర్యంతో చూసింది.

ఆ అపురూప దృశ్యాన్ని చూస్తున్న జనం ఆనంద కోలాహలం మధ్య, బెదిరిన పసి పిల్లల ఉలికిపాట్లూ, ఏడ్పులూ, తల్లి దండ్రుల గారాబంతో కూడిన ఓదార్పులూ వేటినీ కాంతమ్మ చూడలేదు, వినలేదు – ఆ తన్మయానందంలో.

మళ్ళీ శబ్ద తరంగం. మళ్ళీ పైపైకి దూసుకుపోతున్న వెలుగుల రచనలు. చూస్తున్న వాళ్ళ చప్పట్లు, కేరింతలు.

కళ్ళు ఇంత చేసుకొని ఆ వెలుగుల్ని చూస్తూ, కాంతమ్మ తన అనుభవంలో మళ్ళీ వెతుక్కుంది.

తన పెళ్ళి మెరవణి రోజు పేల్చిన నాటురకం ఔట్లూ, తప్పెట మోతలూ, చిందులూ, దివిటీలూ కాంతమ్మ స్మృతిలో గిలిగింతలు పెట్టాయి. ఈ మధ్య

పదేండ్లలో పల్లెల్లో దీపావళి రోజు ఎవరిళ్ళ దగ్గర వాళ్ళు కాల్చుకునే పదోపరకో కాకర పువ్వులూ, చిచ్చుబుడ్లూ, టపాసుల చిన్నచిన్న వెలుగులూ మదిలో మెరిశాయి. ఇక్కడ ఎవరో ఒక్కచోట అందరి సంతోషంకోసం కాలుస్తున్నారు. ఇట్లాంటిది తన పల్లె బతుకులో ఎప్పుడూ చూడలేదు. భర్త ఉండి ఉంటే, ఎంత సంతోషపడిపోయేవాడో అనుకుంది.

ఎన్నికలు, జెండాలు, ఓట్ల కొట్లాటల్లో ఊర్లోని రెండు పార్టీల వాళ్ళు బాంబులు వేసుకున్నప్పుడు, ఏ పార్టీకి చెందని తన భర్త బలి కావడం కాంతమ్మకు ఆ క్షణంలో గుర్తుకొచ్చింది. చీర చెరుగుతో కళ్ళు ఒత్తుకొంది. అది శైలజ చూసి అడిగింది:

"కళ్ళల్లో ఏదన్నా పడిందా అత్తమ్మా?"

చీర చెరగు తీసి, భుజాలకు కప్పుకొని ఎడమ కంటిని ఎడమ చేత్తో తుడుచుకుంటున్న తల్లిని శ్రీధర్ చూశాడు. అప్రయత్నంగా శ్రీధర్ తన చేతిగుడ్డను తీసుకొని, నోటి దగ్గర పెట్టుకొని ఉఫ్, ఉఫ్ అంటూ నాలుగైదు పర్యాయాలు ఊది, తల్లి చేతిని పక్కకు తీసి, ఎడమ కంటి మీద ఉంచాడు.

"ఏం లేదర్రా. ఊరికే కళ్ళు తుడుచుకుంటున్నా. మీరిద్దరూ కంగారు పడ్డారు... శైలజమ్మా! ఆ చప్పుళ్ళకు నీకు భయం వెయ్యలేదా? పైగా కడుపుతో ఉన్నదానివి..."

అత్త పరామర్శకు శైలజ సంతోషపడింది; సిగ్గు పడింది.

"లేదు అత్తమ్మా" అంది.

బాణసంచా మహోత్సవం ఇరవై నిమిషాలు సాగింది. అది ముగుస్తూనే గలగల మంటూ జనం ఎవరిళ్ళకు వాళ్ళు తిరుగు ముఖం పట్టారు. కారులో కూర్చున్నాక శ్రీధర్ తల్లిని అడిగాడు.

"నీకు. నచ్చిందా అమ్మా?"

శైలజ నవ్వుతూ కలుగజేసుకుంది: "అత్తమ్మ ఇన్‌వాల్వ్ అయి చూసింది."

"మరి శైలూనో?" అన్నాడు శ్రీధర్.

"నీకూ, నాకూ సరేలే. అత్తమ్మకు కొత్త కదా?" అంది శైలజ.

"ఏమర్రా! ఇది తిర్నాలా? పండగా? ఏంది?"

అత్త అమాయకమైన ప్రశ్నకు శైలజకు నవ్వు వచ్చింది. మర్యాదకొద్దీ ఆపుకుంది.

తల్లికి శ్రీధర్ ఓపికగా జవాబిచ్చాడు;

"అమెరికాకు స్వతంత్రం వచ్చిన రోజమ్మా. అందుకని ఈ రోజు ఇది..."

"మన పక్కల ఇట్లాంటివి జరపరే. ఎందుకని?"

తల్లి అడిగిన ప్రశ్నకు శ్రీధర్ వెంటనే స్పందించలేకపోయాడు.

కాంతమ్మ తడబడుతూ మళ్ళీ ఒక ప్రశ్న వేసింది:

"దీనికి ఎంత డబ్బు అయిఉంటుంది?"

"తెలియదమ్మా. చాలా అయిఉంటుంది", తెలియని వాటిని తెలియదని చెప్పడం అమెరికాకు వచ్చిన రెండు మూడు నెలల్లోనే శ్రీధర్ నేర్చుకున్నాడు. అదొక ప్రవృత్తిగా కూడా మారిపోయింది.

శని ఆదివారాల్లో కొడుకూ, కోడలూ కలసిమెలసి పనులు పంచుకొని ఏ రాద్ధాంతాలూ లేకుండా చేసుకోవటాన్ని కాంతమ్మ నిశితంగా గమనించింది. ఇల్లు శుభ్రపరచుకోవటం, సెల్లార్‌లోని వాషింగ్ మెషీన్‌లో బట్టలు ఉతుక్కోవటం, ఆరబెట్టుకోవటం, ఇంట్లోని చెత్తా చెదారాన్నీ, చదివి పక్కన పెట్టిన పత్రికల్నీ, ఇంటి ఎదురుగా ఉన్న గార్బేజిలో పడవేసి రావటం, అన్నిటినీ కాంతమ్మ చూస్తూనే ఉంది. 'అక్కడ పల్లెటూర్లో మగ పనులు వేరు, ఆడ పనులు వేరు. ఇక్కడ పనిలో ఆడామగా తేడా లేదు. ఇట్లాగే ఉంటే బాగుంటుంది' అని కాంతమ్మ గట్టిగా అభిప్రాయపడింది.

ఆ ఆదివారం మధ్యాహ్నం భోజనాలు చేస్తున్నప్పుడు కాంతమ్మ అడిగింది:

"ఇల్లు చాలా బాగుంది. బాడిగ ఎంతర్రా?"

"ఆరు నూరు డాలర్లు అత్తమ్మా" అంది శైలజ.

కోడలి వైపు ప్రశ్నార్థకంగా చూస్తున్న తల్లిని శ్రీధర్ గమనించాడు. బిగ్గరగా నవ్వుతూ అన్నాడు:

"అమ్మా నీ కోడలుకు ఎప్పుడన్నా అరవ మాట దొర్లుతుంది, తెలుగు మాట్లాడితే" అన్నాడు.

"నాకంటే బాగా మాట్లాడతాది", అంది కాంతమ్మ.

శైలజ, శ్రీధర్ నవ్వుతో శ్రుతి కలిపింది.

"అదేంది డాలర్లు అన్నావు శైలజమ్మా. మన రూపాయల్లో చెప్పు", అంది కాంతమ్మ.

"దగ్గర దగ్గర ఇరవై వేల రూపాయలమ్మా" అన్నాడు శ్రీధర్, కల్పించుకుని.

"అమ్మో అంతనా? మనపక్క వెలిభూమి అయితే ఒక్క ఎకరా కొనచ్చు" - కాంతమ్మ తన లెఖ్ఖ తాను చెప్పింది.

"ఇక్కడ మేలు అత్తమ్మా. అదే వేరే సిటీలో అయితే..."

"ముప్పయి, నలభై వేలు పెట్టాలి" అని శ్రీధర్ భార్య వాక్యాన్ని పూర్తిచేశాడు.

కాంతమ్మకు నిజంగానే భయం వేసింది. 'ఇంటి బాడిగే ఇంతుంటే ఇంకెంత డబ్బు ఖర్చు అయితాదో ఇండ్లు గడపడానికి' అనుకుంది.

"నువ్వు కాసేపు పడుకోమ్మా నీ రూంలో. సాయంత్రం బయటికి పోదాం" అన్నాడు శ్రీధర్.

పగటి విశ్రాంతి కాంతమ్మ అనుభవంలో లేదు.

తానూ, పెద్ద కోడలూ పొద్దున వెళ్ళి, బాగా ఎండ ముదిరాక తోట దగ్గర నుంచి రావడం, బోరింగు నుంచీ ఇంట్లోకీ, పశువులకూ బిందెలు బిందెలు నీళ్ళు

తెచ్చుకోవడం, నడవ ఊడ్చుకోవడం, ఏవైనా దంచుకునే పనులుంటే చూసుకోవడం, ఇంటి చాకలి నెలకొక్కమారొస్తే ఆ మధ్యలో గుడ్డల్ని ఉతుక్కోవడం, ఇంట్లో పిల్లల్ని చూసుకోవడం... పని... పని... పని... ఎడతెరపిలేని పని... ఆడ పుట్టుక పని...

మెత్తటి పరుపు మీద కాంతమ్మకు తొలిసారి సుఖనిద్ర పట్టింది. మెలకువ వచ్చాక సిగ్గుపడింది. పగటి నిద్ర పనికి చేటని కాంతమ్మ అనుకునేది. బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కొంది. వచ్చిన రోజే బాత్‌రూంలో స్నానాల టబ్బునూ, వేణ్ణీళ్ళ, చన్నీళ్ళ కొళాయిల్నీ, ముఖం కడుక్కునే సింకునూ, సింకుపై ఉండే అద్దం అల్మారాలోని పేస్టునీ, బ్రషుల్నీ, అలంకరణ సామాగ్రినీ శ్రీధర్ తల్లికి దగ్గరుండి పరిచయం చేశాడు. టబ్ బయట స్నానం చేయవద్దని చెప్పాడు. ఊళ్ళోని జాలారిని తలచుకుంటూ, ముఖం తుడుచుకునేటప్పుడు ప్రతి వస్తువునూ కాంతమ్మ కొన్ని క్షణాలు మళ్ళీ మళ్ళీ చూసి, పడిన ఒకటి రెండు ఇబ్బందులకు నవ్వుకుంది. హాల్లోకి వచ్చి టి.వి. చూస్తున్న కొడుకు పక్క సోఫాలో కూర్చుంది. ఎడమవైపునున్న సింగిల్ సోఫాలో కూర్చొని బోనస్ ప్రైజ్ కూపన్ల కోసం వెతుకుతున్న శైలజ అత్తను చూస్తూనే నవ్వి లేచి "బాగా నిద్ర పట్టిందా అత్తమ్మా?" అంది.

"అదేం నిద్రో, మాయనిద్ర పట్టిందమ్మా?" అంది కాంతమ్మ.

"మీ కోసమే చూస్తున్నాం. టీ తెస్తానుండండి", అంది శైలజ.

కోడలి వెంట కుకింగ్ రేంజ్ దగ్గరకు వెళ్ళటానికి కాంతమ్మ లేవబోతోంది.

"మీరు కూర్చోండి అత్తమ్మా. అయిదు నిమిషాల్లో టీ తెస్తా", అంది శైలజ.

మూడు కప్పులోని టీని ట్రేలో పెట్టుకొని, శైలజ అత్తకూ, భర్తకూ చెరొక కప్పు అందించి, తానూ కప్పు తీసుకుంది ట్రేని టీపాయి మీద ఉంచి.

"ఈ రోజు జైంట్ ఫుడ్ స్టోర్స్‌కు పోదాం" అంది శైలజ టీ తాగుతూ.

"ఆమా!" అన్నాడు శ్రీధర్.

"అంటే ఏంది శ్రీధరూ", అడిగింది కాంతమ్మ.

"ఏం లేదులే అత్తమ్మా. మా తమిళాన్ని శ్రీధర్ సరదా కోసం వెక్కిరిస్తాడు. మేము ప్రతిదానికీ ఆమా, ఆమా అంటాం - అంటే అవును అని అర్దం" అంది శైలజ.

"అర్దం కాదు అర్థం" అన్నాడు శ్రీధర్.

"ఇట్లా ఏడిపిస్తాడు చూడండి అత్తమ్మా?" అంది శైలజ నవ్వుతూ.

వాళ్ళిద్దరి అన్యోన్యత చూసి కాంతమ్మ ముచ్చటపడింది.

వెస్ట్ రెడింగ్, షిలింగ్‌టన్ రోడ్డులోని జైంట్ ఫుడ్ స్టోర్స్ ముందు పార్కు చేసిన కార్లనూ, స్టోర్స్‌లో ఒక క్రమపద్ధతిలో అమర్చిన రకరకాల వస్తువుల్నీ చూసి కాంతమ్మ దిమ్మ తిరిగిపోయింది. కొడుకూ, కోడలును బిడియపడుతూనే మూగగా అనుసరించింది. మాంసం, చేపల రకాలను అద్దాల్లోంచీ చూసి జడుసుకుంది. శైలజ కూరగాయల్నీ, ఆకుకూరనూ, పండ్లనూ తీసుకుంది. కౌంటర్ గేటు దగ్గర కొడుకు

డబ్బు ఇవ్వకుండా ఏదో ఇవ్వటం కాంతమ్మ గమనించింది. వాటిని క్యారీ బ్యాగుల్లో వేసి చేతికివ్వటం చూసింది. 'ఇదేం వింత?' అనుకుంది. ఆమెకు పొట్లాలు కట్టి ఇవ్వటమో, గంపలో వేసుకోవటమో మాత్రమే తెలుసు.

ఫ్లాట్ చేరాక, శైలజ తెచ్చిన వాటిని ఫ్రిజ్‌లో అమరుస్తోంది.

కాంతమ్మ బిడియపడుతూ కోడలిని అడిగింది:

"అంత పెద్ద అంగడిలో అప్పు ఇస్తారా శైలజమ్మా"

శ్రీధర్ తల్లికి దాన్ని మాల్ అంటారనీ, క్రెడిట్ కార్డుతో ఏ వస్తువైనా కొనవచ్చుననీ తల్లికి అర్థమయ్యేట్లు వివరంగా చెప్పాడు.

క్యారీ బ్యాగుల్లోంచీ శైలజ తీసి పెడుతున్న టమోటాలు, ఆకుకూర, అరటిపండ్లను కాంతమ్మ చూసింది. వాటి ధరలను తెలుసుకోవాలనుకుంది.

"టమోటాలు కిలో ఎంత శైలజమ్మా?" అని అడిగింది.

"ఇక్కడ కిలోల ఎడై కాదు అత్తమ్మా, పౌండ్లే" అంది శైలజ.

"అంటే?"

అత్తకు ఎట్లా చెప్పాలో కోడలికి స్ఫురించటంలేదు. ఎడై ప్రయోగానికి శ్రీధర్‌కు నవ్వు వచ్చింది. శ్రీధర్ తల్లికి చెప్పాడు:

"ఎడై అంటే తూకం అమ్మా అదే పౌండు/అంటే రెండు సేర్లు. దగ్గర దగ్గర అర కిలో."

"అయితే అర కిలో ఎంత?"

"ఎంత శైలూ?"

శైలజ బిల్లు చూసి "డాలర్ ఫిఫ్టీ ఎయిట్ సెంట్స్" అంది.

"మన రూపాయల్లో ఎంత?"

"యాభై అయిదు రూపాయలు పైననే అమ్మా"

"అంతనా? మరి ఆకుకూర?"

"ఎంత శైలూ?"

"ఎయిటీత్రీ సెంట్స్"

"అంటే ముప్పయి రూపాయలమ్మా"

నోరు నొక్కుకుంటూ, "మరి అరటి పండ్లో?" అంది కాంతమ్మ.

"ఎంత శైలూ?"

శైలజ నవ్వును ఆపుకోలేకపోతోంది. "టూ డాలర్స్ నైన్ సెంట్స్" అంది.

"డెబ్బయి అయిదు రూపాయలమ్మా" శ్రీధర్ జవాబిచ్చాడు.

"ఎంత బాగా పొదుపుగా ఉంటే మాత్రం నాలుగు పండ్లు డెబ్బయి అయిదు రూపాయలా? అక్కడే మన దేశంలో అన్యాయమనుకుంటే, ఇక్కడ అమెరికాలో ఇంకా అన్యాయమా?"

శ్రీధర్‌కు తెగ నవ్వు వచ్చింది.

"మన తోట్లో టమోటాలు, మిరప, ఎర్రగడ్డలు వేసే వాళ్ళం గదమ్మా. ఈ సారేమైనా వేశారా?"

ఇంటి వ్యవసాయాన్ని శ్రీధర్ గుర్తుచేయటంతో కాంతమ్మకు ఆ అగచాట్ల బతుకులు మనసులో మెదిలాయి. గుండెలో, గొంతులో బాధ. ఆ ఘోష చెప్పింది:

"ఈసారి వెయ్యలా. పోయినసారి టమోటాలు పండించినామా? కిలో అర్థ రూపాయకు కొనుక్కునే నాథుడు లేడు. గొడ్లకు పెట్టేవి పెట్టినాం. గంపలకు గంపలు దిబ్బలో పోసినాం. మిరపా అంతే. ఎర్రగడ్డల సంగతి చెప్పాల్సిన పనిలేదు. మిగతాచోట్ల ఏమోగానీ, శ్రీధరూ! మన పక్క పల్లెలో రైతులు ఏం పండించినా బాగుపడింది లేదు. పంట దండిగా చేతికొచ్చినప్పుడు ధరలుండవు. ధరలు బాగా ఉన్నప్పుడు పంట దిగుబడి తక్కువ - బోరులో నీళ్ళు తక్కువొచ్చో, వాన లేకో, తెగుళ్ళు తగిలో. ఇంక పత్తి పంట వేసినోళ్ల గోడు చెప్పేదానికి లేదులే. ఒక్కటి గాదులే. అదొక దరిద్ర లోకం నాయనా".

శైలజ, అత్త మాటల్ని శ్రద్ధగా వింది. ఆ మాటల వెనుక బాధను అర్థం చేసుకుంది.

"మీ ప్రాంతాల్లో వ్యవసాయ జీవితం అంత అన్యాయంగా ఉంటుందా శ్రీ?" అని శ్రీధర్‌ను ఇంగ్లీషులో అడిగింది.

"మద్రాసులో పెద్ద ఉద్యోగస్తులుగా ఉండే తల్లిదండ్రుల మధ్య కష్టాలు లేకుండా పెరిగిన దానివి. రాయలసీమ గ్రామాల ఇక్కట్లు నీ నెత్తి మీద నేనూ, మా అమ్మా కలసి రుద్దటం బాగుండదు. మీకు తెలుగు గంగను ఇచ్చిన వాళ్ళం", పరిహాస పూర్వకంగా శైలజకు ఇంగ్లీషులో చెప్పి, తల్లితో తెలుగులో మాట మార్చాడు:

"అమ్మా! ఇక్కడ ఉండే నాలుగైదు నెలలూ ఏ దిగులూ పెట్టుకోకుండా ఉండు - సంతోషంగా. ఏం కావాలన్నా అడుగు. శైలుకు నిన్ను గురించీ, మన కుటుంబం గురించీ అన్నీ తెలుసు. నువ్వు రావడంతో శైలుకు కొత్త ఉత్సాహం వచ్చింది. 'మా అమ్మ వచ్చినాక జొన్న రొట్టెలు, మెంతిపప్పు, నూనె వంకాయ, సంగటి, మాంసం చేసిపెడుతుంది' అని శైలుకు చెప్పినాలే. శైలుకు అవి తెలియవు. శైలు చేసే సాంబారు తిన్నావు, పొంగల్, కూటు, మోర్ కొలంబో శైలు భలే రుచిగా చేస్తుంది."

"శ్రీలంక, కొలంబో కాదు శ్రీ! కళంబ్ అనాలి", అంది శైలజ పకపక నవ్వుతూ.

'మొగుడూ పెండ్లాలు ఇట్లా ఉండాల', అనుకుంది కాంతమ్మ.

"మనం ఆఫీసుకు పోతే, అత్తమ్మకు పొద్దుపోవటానికి న్యూజెర్సీ నుంచీ తెలుగు సినిమా క్యాసెట్లు తెప్పించుకుందాం" అంది శైలజ.

ఆ అభిమానానికి కాంతమ్మ పొంగిపోయింది.

శని ఆదివారాలు తప్ప, మిగతా అయిదు రోజుల్లో వాళ్ళ పనితీరు చూసి విస్తుపోయింది. పల్లెటూళ్ళో ఆడవాళ్ళే, మగవాళ్ళ కంటే ముందులేస్తారు. ఇక్కడ ఇద్దరూ వేకువ జామున్నే లేవటాన్ని కాంతమ్మ గమనించింది. చకచకా తయారై, కాఫీ తాగి, ఇంత తిని, ఇంత బాక్సుల్లో పెట్టుకొని చెరి ఒక కారులో ఉదయం ఏడులోపే పనిచేసే చోట్లకు వెళ్ళటాన్ని చూస్తోంది. మామూలుగా అయితే సాయంత్రం చీకటి పడ్డాకే తిరిగి రావటం గమనించింది. శ్రీధర్ ఒక్కొక్కరోజు రాత్రి చాలా పొద్దుపోయాక రావటం కూడా చూసింది. వాళ్ళు ఇంట్లో మాట్లాడుకునేదాన్ని బట్టి, వాళ్ళ పనిధ్యాస ఏమిటో కాంతమ్మకు లీలగా అర్థమైంది.

'ఊర్లో తన పెద్ద కొడుకుకు పొలం పనిమీద కంటే పై పనులూ, పై తిరుగుళ్ళూ ఎక్కువ. కోడల్ని రాచి రంపాన పెడతాడు. రెండో కొడుకు పులివెందులలో టీచరు. అందరికంటే పెద్దది కూతురు. కనుమ అవతల సంబంధం. అతనూ టీచరు. అయినకాడికి బాగున్నారు. చిక్కంతా పెద్ద కొడుకు సంసారంతోనే.'

ఈ రకం ఆలోచనలు కాంతమ్మకు ఏ తెలుగు సినిమానో చూస్తున్నప్పుడు వచ్చేవి. కాంతమ్మ స్వంత పనులు, శ్రీధర్, శైలజ ఆఫీసులకు వెళ్ళిపోయాక మొదలయ్యేవి. రాత్రికి అవసరమయ్యే వంట పని చూసుకునేది. టి.వి.లో కొడుకు న్యూజెర్సీ నుంచీ తెచ్చిన, తెప్పించిన వీడియో కేసెట్లలో ఏదో ఒకటి పెట్టిపోతే, తెలుగు సినిమా రోజుకొకటి చూసేది. టేప్‌రికార్డరులో తెలుగు పాటలు కాసేపు వినేది. ఒక అరగంటో గంటో నిద్ర. ఒంటరితనం బాధించేది – బిక్కుబిక్కు మంటూ ఇంట్లో ఉండటంవల్ల. తోచనప్పుడు కిటికీలోంచి కన్పించే ఓక్, పైన్ చెట్లను చూస్తూ, రోడ్డు మీద అప్పుడప్పుడూ కన్పించే వృద్ధుల్నీ, పిల్లల్నీ చూస్తూ పొద్దుపుచ్చేది. వర్షం వచ్చినప్పుడు కిటికీలోంచి ఆ దృశ్యాన్ని చూస్తూ పరమానంద పడేది.

పల్లెల్లో ఊపిరి సలపని పనిలో కాంతమ్మకు విసుకొచ్చేది. వైరాగ్యమొచ్చేది. ఆ మధ్య కొన్న టి.వి.లో కార్యక్రమాల్ని ఏ గంటో తీరికగా చూసే అవకాశం కూడా చాలా సందర్భాల్లో ఉండేది కాదు. ఇక్కడ చేతినిండా పనిలేదు. కాంతమ్మ దృష్టిలో అసలు పనేలేదు. బయటి సమాజంతో సంబంధం లేదు. భాష తెలియదు.

అమెరికా జీవితానికి కాంతమ్మ నెమ్మదిగా అలవాటు పడుతోంది. అప్పుడప్పుడూ ఆమెకు పెద్ద కోడల్నీ, పిల్లల్నీ చూడబుద్ధి అయ్యేది.

శని ఆదివారాల సందడి ఆమెకు ఇష్టంగా ఉండేది. తప్పకుండా ఆ రెండు రోజుల్లో ఇంటికి తెచ్చుకునే సరుకుల ధర వరలు, ఖర్చుల వివరాలు కోడలిని అడగటం మాత్రం మరిచిపోయ్యేది కాదు. శైలజ ఓర్పుగా చెప్పేది. ఖర్చు అవుతున్న అంకెలను మనసులో ఎంత కూడుకోవాలని ప్రయత్నించినా, కాంతమ్మకు పూర్తిగా సాధ్యపడేది కాదు. మారకం విలువలు ఆమెకు పట్టుబడలేదు. ఇక్కడ సంపాదనా ఎక్కువే, ఖర్చులూ ఎక్కువే. ఇద్దరూ సంపాదిస్తున్నారు కాబట్టి సుఖంగా ఉన్నారనుకుంది. ఆ సుఖాన్ని శ్రీధర్, శైలజల దాంపత్యంలో కాంతమ్మ చూసింది. శని ఆదివారాల సందడిలో అది ప్రత్యక్షంగా కన్పించేది.

ఒకటి రెండు పర్యాయాలు తెలిసిన తెలుగు వాళ్ళ ఇంటికీ, తమిళ తెలుగు వాళ్ళ ఇంటికీ కాంతమ్మను శ్రీధర్, శైలజ తీసుకవెళ్ళారు. అక్కడ ప్రాణం లేచివచ్చేది. కానీ అక్కడి తన తరం వాళ్ళ వంటలూ వార్పుల మాటలు అర్థమైనంతగా, వాళ్ళ పూజలూ పురస్కారాల, యోగుల, బాబాల సంభాషణలు అర్థమయ్యేవి కావు. కాంతమ్మకు తెలిసింది నాగులచవితి, ఉగాది పండగల పూజలు మాత్రమే.

ఒక ఆదివారం మధ్యాహ్నం శ్రీధర్ స్నేహితులు భోజనానికి ఇంటికి వచ్చారు. 'మా అమ్మ' అని శ్రీధర్, మా 'అత్తమ్మ' అని శైలజ అతిథులకు పరిచయం చేశారు - రెండు మూడు భాషల్లో. వచ్చిన వాళ్ళందరూ కాంతమ్మను ఎంతో గౌరవంగా చూశారు. మొత్తం ఎనిమిది మంది. రెండు జంటలూ, మరో నలుగురు యువతీ యువకులు. కాంతమ్మతో తెలుగులో మాట్లాడింది రాజమండ్రి ప్రాంతం దంపతులు మాత్రమే. శైలజ ఒక జంటతో తమిళంలో మాట్లాడింది. హిందీలో మాట్లాడుకున్నారు, ఒకరిద్దరు. ఎక్కువగా వాళ్ళందరి మధ్యా ఇంగ్లీషు నడిచింది. ఎవరెవరు ఎక్కడి నుంచి వచ్చారో తల్లికి శ్రీధర్ చెప్పాడు: ఒకరిది కాలికట్, ఒకరిది కలకత్తా... ఆ స్థలాలూ, వాటి రాష్ట్రాలూ కాంతమ్మకు తెలియకపోయినా, బంధువులు కాని ఆ బంధువులకు ఆప్యాయంగా వడ్డించింది. కాంతమ్మ చేసిన సెనగబేడల పాయసాన్ని అందరూ తెగ మెచ్చుకున్నారు.

కలకత్తా యువకుడు అరుణ్‌ఘోష్ తాను తెచ్చిన తమలపాకుల్ని కాంతమ్మ చేతిలో పెట్టాడు. తెలుగు దంపతుల మాటల్లో ఒక్కొక్క ఆకు ఒక డాలరు అని కాంతమ్మకు తెలిసింది. 'ఇరవై ఆకులున్నాయి. అంటే ఇరవై డాలర్లు. డాలరుకు ముప్పయి ఆరు రూపాయల చిల్లర - మొత్తం..." కాంతమ్మకు మతిపోయింది. శ్రీధర్ అందరికీ కిళ్లీలు కట్టి ఇచ్చాడు. కాంతమ్మకు కిళ్లీ నములుతూ ఉంటే చాలా రుచిగా ఉన్నా, రూపాయలు నములుతున్నట్లు అనిపించింది.

మరొక శుక్రవారం సాయంత్రం ఆడమ్స్ టౌనుకు శ్రీధర్, శైలజా, కాంతమ్మా కలసి వెళ్ళారు. ఫార్మర్స్ మార్కెట్ కాంతమ్మకు తెగ నచ్చింది.

"మన పక్క సంత మాదిరి ఉంది శ్రీధరూ" అంది.

"రైతులు పండించి తెచ్చినవి ఇక్కడ అమ్ముకుంటారమ్మా", శ్రీధర్ తల్లికి చెప్పాడు.

వ్యవసాయపు పనిముట్ల దుకాణాలూ, రెడింగ్‌లో చూడని గుర్రపు బగ్గీలూ, వాటి మీద కన్పించిన తెల్లటి పొడుగాటి గడ్డం మనుషులూ, రాశి పోసిన కళింగర కాయలూ, నేల మీదపరచి అమ్ముకుంటున్న పిల్లల బొమ్మలూ... అన్నిటినీ కాంతమ్మ పరమాశ్చర్యంతో చూసింది. "గుర్రపు బండి మీదుండేవాళ్ళెవరు?" అని అడిగింది.

శైలజ చెప్పింది: "వీళ్ళను అమిష్ వాళ్ళు అంటారు అత్తమ్మా" అని.

ఆమిష్ వాళ్ళను గురించీ, వాళ్ళ వ్యవసాయాన్ని గురించీ, ప్రత్యేకతల గురించీ శ్రీధర్ తల్లికి సంగ్రహంగా చెప్పాడు.

"మన పల్లెటూర్ల పద్ధతులన్నమాట."

కాంతమ్మ మాటలకు కొడుకు, కోడలు పగలబడి నవ్వారు. కాంతమ్మ జత కలిపింది.

శ్రీధర్, శైలజ ఆగస్టు 16న కాంతమ్మను న్యూజెర్సీకి తీసుకువెళ్ళారు. అక్కడి బంగారు షాపుల్లోని కొనుగోళ్ళనూ, రద్దీని చూసింది - విస్మయంతో. 'ఇంత బంగారం పిచ్చా? ఇంత మంది ఇట్లా కొంటారా?' అని విస్తుపోయింది. తనకేమీ వద్దు వద్దు అంటున్నా శైలజ అత్తకు నాలుగు గాజులు తీసింది. చిన్నన్న పిల్లల్లో, అక్క పిల్లల్లో చెరొక అమ్మాయికి ఒక్కొక్క గొలుసును శ్రీధర్ కొన్నాడు. అక్కకు ఒక లాంగ్ చైన్ కొన్నాడు. పెద్ద వదినకూ, చిన్న వదినకూ రెండేసి గాజులు కొన్నాడు. 'ఇదేం పిచ్చి శ్రీధరూ?' అని కాంతమ్మ అంది.

"అటు చూడమ్మా ఆ గుజరాతీ వాళ్ళు బంగారం షాపులోకి అడుగు పెట్టినారంటే యాభై లక్షలకు తక్కువ కొనరు - పెండ్లిండ్ల సీజన్లో. ఇప్పుడు బంగారం ధర తగ్గిందిలే అమ్మా. ఇండియాలో కంటే తక్కువ. ఊరికి పోయేటప్పుడు తీసుకుని పోదువుగానీ" అన్నాడు శ్రీధర్.

కోడలు, కొడుకు ప్రేమలకు కాంతమ్మ లోలోపల సంతోషించినా, డబ్బు దండుగ చేస్తున్నారేమో అనుకుంది.

బంగారం షాపులోంచీ బయటికి వచ్చినప్పుడు, కారు వెనుక ఒక పెద్ద భారత జాతీయ పతాకాన్ని కట్టుకొని 'స్వతంత్ర భారత్‌కి జై' అని నినాదమిస్తూ వెళ్తున్న ఒక యువకుణ్ణి చూసింది. జాతీయ పతాకం కర్ర చివర రెపరెప లాడుతోంది. కాంతమ్మకు ముచ్చటేసింది. శ్రీధర్ స్కూల్లో చదువుకుంటున్నప్పుడు నానా గొడవచేసి, కాగితం జెండాలు కొని ఇంటికి కట్టడం గుర్తుకొచ్చింది.

'మూవీ టైం'లో శ్రీధర్ తల్లి కోసం తెలుగు సినిమా క్యాసెట్లు తీసుకున్నాడు. కాంతమ్మా మూవీ టైంలోని భిన్న భాషల క్యాసెట్లు చూసి 'అన్ని సినిమాలున్నాయా?' అనుకుంది. సబ్జిమండీలోని ఉప్పులూ, పప్పులూ మొదలుకొని మునక్కాయలు, మామిడికాయలు, కరివేపాకు సైతం ఉండటం కాంతమ్మ గమనించింది. 'వీళ్ళకు దొరకనవి అంటూ ఏవీలేవు' అనుకుంది.

న్యూజెర్సీ నుంచీ తిరిగి వచ్చాక ఆ మరుసటిరోజు ఆదివారం సాయంత్రం శైలజ అత్తను వెంటబెట్టుకొని 'మాల్స్' తిప్పేందుకు వెళ్ళింది. శ్రీధర్ ఏదో పనిఉందని చెప్పి ఇంట్లో ఉంటానన్నాడు.

శైలజ, కాంతమ్మ, తిరిగే వచ్చే వేళకు రాత్రి 8.30 అయింది. ఫ్లాట్‌లోకి అడుగు పెడుతూనే శైలజ పసిపిల్లలాగా ఉత్సాహంగా చెప్పింది:

"అత్తమ్మకు డాలర్ ట్రీ బాగా నచ్చింది. ఇంట్లోలేని కొన్ని ఐటమ్స్‌ను అత్తమ్మ సెలెక్ట్ చేసింది. యువర్ పెట్ సెంటర్ ఇంకా బాగా నచ్చింది అత్తమ్మకు. అదుసరి శ్రీ నువ్వు చిన్నప్పుడు పావురాల్ని పెంచావటగదా. అత్తమ్మ చెప్పిందిలే."

శ్రీధర్ ప్రతిస్పందించలేదు. ఆలోచనల్లో మునిగి ఉండటం శైలజ గమనించింది.

"ఏమైంది శ్రీ?" అని శైలజ అడిగింది.

దాదాపు రెండు గంటలనుంచీ తొలుస్తున్న బాధనూ, మధ్యలో రేగిన కోపాన్నీ, కలిగిన విసుగునూ, బలవంతంగా శ్రీధర్ అణచుకోటానికి ప్రయత్నిస్తూ, తల్లి వైపు తిరిగి అన్నాడు:

"అమ్మా! చిన్నన్న ఫోను చేసినాడు."

"అందరూ బాగున్నారంటనా? ఊరి దగ్గర సంగతులేమన్నా చెప్పినాడా?"

"చిన్నన్నతో ఇబ్బందేముందమ్మా. తన పని, తన సంసారం! ఊరి దగ్గర సంగతులే... పెద్దన్న తాను బాగుపడడు... అయినవాళ్ళను బాగుపడనీడు."

"ఏం జరిగింది?"

తల్లి ఆందోళనను శ్రీధర్ పసిగట్టాడు. నెమ్మదిగా విన్నది చెప్పటానికి పూనుకున్నాడు.

"మనకు స్వతంత్రం అంటే విచ్చలవిడిగా బతకడం, తాగడం, పంతాలూ పట్టింపుల్తో కొట్లాటలు పెట్టుకోవడం... అంతే కదమ్మా?"

"ఏంది శ్రీధరూ! జరిగింది చెప్పు?"

"మన ఊళ్ళో కొత్త గలాటా అంట! తెలుగు దేశమో, కాంగ్రెసో ఏదైతేనేం ఈయన కెందుకు? రాళ్ళు వేసుకున్నారు. వాములు కాల్చుకున్నారు. బాంబులు వేసుకున్నారు...."

శైలజ భయంతో వింటోంది. కాంతమ్మ అప్రయత్నంగా అడిగింది:

"మీ అన్నకేమైనా అయిందంటనా?"

"ఏం కాలేదు", జైల్లో ఉన్నాడని మాత్రం శ్రీధర్ చెప్పలేకపోయాడు.

"వ్యవసాయం చూసుకుంటూ, ఏదో వ్యాపారం చేసుకుంటానంటే లక్ష ఒకసారి, మూడు లక్షలొకసారి పంపినా. ఆ డబ్బుల్లో అక్కకు ఒక యాభై వేలు, చిన్నన్నకు ఒక ఇరవై అయిదు వేలూ ఇమ్మని చెప్పినా. వాళ్ళకు దమ్మిడీ ఇవ్వలేదు. డబ్బును ఏం చేసినాడో, ఏమోగానీ మళ్ళా మామూలే..."

"మళ్ళా అంటే... చిన్నన్నతో డబ్బు అడిగించినాడా?"

శ్రీధర్ తన లోపలి బాధను తల్లికి చెప్పాడు, స్వగతంగా:

"అమ్మా! ఇక్కడికి వచ్చినాక మూన్నెల్లు ఉద్యోగం లేదు. హైదరాబాద్ కంపెనీవాడు వీసా ఇప్పించి నడిబజార్లో తోసినాడు. పెట్రోలు బంకులో పనిచేసినా. ఇంకేవో చేసినా. శైలజను చూడు. మన కులం కాదు, మన ప్రాంతం కాదు, నా పక్కన కష్టాల్లో నిలబడింది. తన ఒక్క ఉద్యోగంతో ఇద్దరం కొన్నాళ్ళు... తరువాత నాకూ ఉద్యోగం దొరికింది. మా పెళ్ళివల్ల వచ్చే కట్నం పోయిందని ఏడ్చినవాడు పెద్దన్నే - ఎవరూ కాదు. అడిగిన డబ్బు పంపినాకనే నిన్ను అమెరికాకు తీసుకుపోవటానికి ఒప్పుకున్నాడు. రెండు నెలలు పోయినాక శైలజ ఉద్యోగం మానుకోవాలి... మళ్ళా ఎప్పుడు ఎక్కడ దొరుకుతుందో తెలియదు. నువ్వే

చూస్తున్నావు. రోజూ నలభై మైళ్ళు పోవాలి – శైలజ కారులో తన ఉద్యోగానికి. నేనూ మరొక కారులో అంతే. ఈ కార్లు కూడా అందుకోసమేనమ్మా... నిజం చెప్పమంటావా? మన పక్కల నుంచి వరిపండే కాలవ కింద పల్లెలకు పోయే కూలోళ్ళకూ, మాకూ తేడా లేదు. కోతలు ఎన్నాళ్ళుంటాయో వాళ్ళకు తెలియదు. ఇక్కడ మాకూ అంతే."

"మల్లా డబ్బు కావాలని మీ చిన్నన్నతో అడిగించినాడా?"

శ్రీధర్ మౌనాన్ని చూసి కాంతమ్మ తేల్చి చెప్పింది:

"శ్రీధరూ! కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. మీ పెద్దన్నకు డబ్బుంటే జల్సాలు చేసేదనే మతం. ఇంకేం పంపవద్దు. పంపి ఇంకా చెడగొట్టవద్దు."

"అత్తమ్మ నిజం చెప్పింది. మీ చిన్నన్నకూ, మీ బావకూ చెప్పండి. ముందు ముందు మగపిల్లల చదువుల కోసం చేయగలిగింది చేద్దాం", అంది శైలజ.

"నా మనసులో ఉండే మాటనే కోడలు చెప్పింది", అనుకుంది కాంతమ్మ.

ఆ రాత్రి కాంతమ్మకు ఒకంతట నిద్ర పట్టలేదు. తనతో చెప్పకుండా శ్రీధర్ ఇంకా ఏదో దాచాడనే అనుమానం ఆమెను పీడించింది. 'స్వంత కడుపున బిడ్డల్లోనే ఎంత తేడాలున్నాయి? పెద్దవాడు ఏ పని చేసినా తనదే రైటు అనుకుంటాడు. రెండోవాడు కుదురు మనిషి, శ్రీధర్‌కు ప్రేమలున్నాయి, బిడ్డ పుట్టబోతోంది. కూతురు సంసారాన్ని గుట్టుగా నడుపుకుంటా ఉంది... ఈ పెద్దవాడు బాగుపడేదెట్లా?'

కలత నిదురలో కాంతమ్మ కళ్ళ ముందు ఏవేవో దృశ్యాలు...

'పెద్ద కొడుకు చుట్టూ పదిమంది పోగై ఉన్నారు. అందరూ తాగుతున్నారు, తింటున్నారు. జంభాలు పోతున్నారు.

బాంబుల మోతలు... కాలిపోతున్న వాములు... పైకి లేస్తున్న మంటలు...

ఆకాశంలో ఏవేవో వెలుగులు... వెలుగుల మధ్య పైకి లేచి రెపరెపలాడుతున్న స్వతంత్రం జెండా...

చూస్తున్న తెల్లవాళ్ళూ, నల్లవాళ్ళూ. అవేవో వేరే జెండాలు ఇళ్ళ మీద. ఆ జెండాల కర్రల్తో బాదుకుంటున్న మనుషులు... మంటలు... ఆ మంటల్లో పెద్ద కొడుకు...

"బయటికి రా...రా" అంటున్న శ్రీధర్... పెద్ద కోడల్నీ, పిల్లల్నీ ఓదారుస్తున్న శైలజ...

కాంతమ్మ ఉలికిపడి లేచింది. భయంతో వణికిపోయింది... మంచినీళ్ళు తాగి 'ఏం కాదులే – ఈ మొండి ప్రాణాలకు' అనుకుంటూ కళ్ళు గట్టిగా మూసుకుంది.

కథా నిలయం
5510
శ్రీకాకుళం

● (తొలకరి, ఏడవ ఆటా తెలుగు సమావేశ
విశిష్ట సంచిక, డలాస్, జూలై 2002.
- రచన, డిసెంబరు 2002.
- కథావాహిని, 2003.) ●